







శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!
సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

ప్రతి పదం - గురుపథం



## విజయదశమి సంచిక



"గురువుని" సంపూర్ణంగా నమ్ముకో
(అన్ని కాలాలలోనూ, అన్ని పరిస్థితులలోనూ)
అదే అసలైన సాధన.

సంపుటి : 12

# గురుకృప

సంచిక : 4



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీ బాబూజీ



## లోపలి పేజీలలో

అనుగ్రహ దర్శనాంబుధి – పద్మ 7
పూర్ణమైన పూర్ణిమ - పరిపూర్ణ గురుపూర్ణిమ – గురుకృప 4
మొండి వ్యాధి - కాపాడుతున్న ఊదీ – ఉదయలక్ష్మి 8
బదిలీ(ల) బాధలు - సద్గురుని బోధలు – విమల 10
సత్య సంకలనాలు – గురుకృప 14
పరమాచార్యుని నోట - గురునిమాట 16



నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01. Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Ph : 2740222



# పూర్ణమైన పూర్ణిమ - పరిపూర్ణ గురుపూర్ణిమ

అది సాయిపథం ప్రాంగణం – జూలై 6వ తేదీ సాయంత్రం సాయియానంలో సాగే సాయిభక్తులందరూ, సాయిని మనసారా కొలుస్తూ, వాచా స్మరిస్తూ, (కర్మణా) తనివితీరా చప్పట్లు చరుస్తూ, తమ త్రికరణాలను సాయిఊసు, సాయిధ్యాసలలో నిలుపుకుంటూ, ఆనంద స్వరూపమే తానైన ఆ అవ్యాజ ప్రేమమూర్తిని కన్నులారా వీక్షిస్తున్నారు. ఏమిటి ఈ తన్మయత్వమని ఆలోచిస్తుంటే, అనుభవమున్న ఒక వ్యక్తి ఇలా అన్నారు "అక్కడ చూస్తున్నది సాయి చిత్తరువు కాదు, అక్కడ చేస్తున్నది 'సాయి'ని చిత్తంలో నిలుపుకునే ప్రయత్నం". మెల్లగా అర్థమవ్వసాగింది, 'సాయి'నే కేంద్రంగా చేసుకొని కేవలం సాయి అనే సుమధుర పుష్పం చుట్టూ భ్రమించే ఈ తెమ్మెరలు (గురుబంధువులు) సాయిపథగాములనీ, ఆ ప్రాంగణంలో ఉన్న బిడ్డలంతా సదా సాయి తన్మయులై, మూర్తీభవించిన ఆనందమై, ధర్మ స్వరూపులై, భక్తి–జ్ఞానముల తావియై విలసిల్లే తేజోమూర్తి, సత్ప్రేమదీప్తి అయిన పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ బిడ్డలని! ఇంతలో పారాయణ ప్రారంభమయింది. ఒక మరాఠీ గురుబంధువు సాయి సచ్చరిత్రలోని ఒక్కొక్క ఓవీ చదువుతూ (శ్రావ్యంగా కీర్తిస్తూ) హిందీలో విశదీకరించి చెపుతున్నారు. భాష తెలియదని బాధలేదు, ఎందుకంటే సాయిపథం ప్రాంగణంలో అది మననమైనా, స్మరణ అయినా, కీర్తనైనా, కావ్యమైనా, గానమైనా, గాథ అయినా అది ముమ్మాటికీ సాయిదే! అందులో ఎట్టి సందేహం లేదు, సందిగ్ధము లేదు. ఎందుకంటే ఇది శ్రీసాయిప్రేమ కుండపోతగా వర్షించి, ఎందరి జీవితాలకో మార్గాన్ని, గమ్యాన్ని చూపుతున్న శరచ్చంద్రుని ప్రేమపథం – సాయిపథం. భక్తుల వ్యక్తిత్వపు పరిమితులు దగ్ధమవుతున్న మధుర క్షణాలలో ధవళ కాంతులతో, అడుగులో అడుగు వేసుకుంటూ శ్రీబాబూజీ సాయి సత్సంగమందిరంలో వేంచేసారు. పూజ్యశ్రీబాబూజీ వేదిక మీద ఉన్న ఆ క్షణాలు గుర్తుకొస్తేనే మనసు పట్టు తప్పుతోంది. సాయినామస్మరణ జరిగిన తీరు– చుట్టూ ఉన్న జగత్తును మరిపించి, అన్ని పరిమితులను దాటించి, సాయిలో, సాయితో లయమయిందా అన్న భావన కలిగి ఒక అవ్యక్తమైన అనుభూతిని కలిగించింది. ఇంతలో అక్కడున్న భక్తులలో సాయివిరాట్ స్వరూపాన్ని దర్శించుకుని సాయి 'గురుచరణా'నికి పయనమయ్యారు పూజ్యబాబూజీ! తమ కష్ట, సుఖాలను గురుదేవులకు విన్నవించుకుంటే, ఆ విన్నపాలు సాక్షాత్తూ, ఆ సాయినాథునికి విన్నవించుకున్నట్లు భావించే ఎందరో గురుబంధువులు ఒక క్రమంలో నిలబడ్డారు. అందరు బిడ్డలు శిరిడీ చేరారా! లేదా! అని గమనిస్తూ కొందరు బిడ్డల రాకకై చూస్తూ, తమ ఆశీఃపూర్వకమైన అనుగ్రహ దృక్కులనే అక్షతలుగా, తమ మౌన వ్యాఖ్యనే బోధగా అందించి, గురుచరణ్‌కు పయనమయ్యారు శ్రీబాబూజీ. శిరిడీ చేరిన వారందరికి తృప్తిగా దర్శనమయ్యింది. ఎక్కడో కొంచెం వెలితి మనసులలో. సద్గురు అనుగ్రహం ఎల్లప్పుడూ వర్షిస్తూనే ఉంది. అయితే ఆ ఎరుక మనలో నిలవడం లేదు. ఈ రోజు దర్శనం అయింది. కానీ భాషణం? ఎవరి భాషణం?



గురువుగారిదా? మనదా! మనదే! వినతులు, విన్నపాలు మనవి. మౌనమనే భాష, సాయి అనుగ్రహమనే బాస వారిది. చిన్నా, పెద్దా ప్రతివారికి ఒకటే గిలిగింత, చింత! శ్రీసాయి సద్గురు సన్నిధిలో సమయగతి తెలియకుండానే రాత్రిగడిచి శిరిడీ నగరసంకీర్తనతో మరో మధురమైన రోజుకు సర్వం సిద్ధమైంది. పూజ్య గురుదేవులను దగ్గరగా దర్శించుకునే భాగ్యానికై తెల్లవారుఝాము నుంచే 'గురుచరణా'ల చెంత చేరారు కొందరు గురుబంధువులు. సమయం గడిచే కొద్దీ భక్త జనసంద్రమయ్యింది వేదిక. ఎప్పటిలాగే తంతులు లేని, ఆడంబరాల తావు అసలే లేని వివాహ మహోత్సవాలు. వధూవరులు సాయితో తమకున్న అనుబంధాన్ని తరచి తరచి చూసుకుంటూ, తమ ఆశల ఊసులను పొదవి పట్టుకుని శ్రీబాబూజీ చరణాల చెంత సుమాలుగా అర్చించారు, తరించారు. వేలాదిగా దేశ, విదేశాల నుంచి వచ్చిన సాయి భక్తులకు సాయి ప్రసాదాన్ని అందించే పనిలో కొందరు, సాయిపథ ప్రాంగణ ఏర్పాట్లలో మరికొందరు, ..... సాయిబాబా, సాయిబాబా... అంటూ ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా, ఎలుగెత్తి తమ గుండె లోతుల నుంచి పిలుస్తున్నారు అందరూ! ఇలా సాయిసేవకు అంకితమై శిరిడీ యాత్రను సద్వినియోగం చేసుకున్నారు. సమాధానమిచ్చే స్థితిలో ఉన్న ఆ సద్గురుదేవుడు శ్రీసాయినాథుని దర్శించుకుని, గురుపూర్ణిమ మహోత్సవానికి మకుటాయమానమైన పల్లకీ ఉత్సవంలో పరవశించి, ఆనందాబుధిలో ఓలలాడారు గురుబంధువులు. సత్సంగ మందిరంలో పూజ్య గురుదేవుల దర్శనానంతరం, గురుబంధువులు తమ విన్నపాలు చెప్పుకునే క్రమంలో, వరుసగా నిలబడ్డారు, వారిలో ఒకతను పంచె కట్టుకుని, చక్కగా గంధాన్ని, కుంకుమను ధరించి సాయి చిత్రపటాన్ని చేతిలో ఉంచుకుని, వరుసలో నిలబడ్డారు, శ్రీబాబూజీ కరములచే సాయి చిత్రపటాన్ని తాకించుకోవాలని. నెల్లూరు జిల్లాలోని ఒక పల్లెటూరు. పేరు రమణయ్యట! రమణీయంగా చెప్పారు. గురువుగారు గురుచరణ్ ప్రాంగణంలోనికి వచ్చిన దగ్గరనుంచి బారికేడ్లు ఎక్కి మరీ గమనిస్తున్నాడు గురువుగారిని చూసే ప్రయత్నంలో! చల్లని చూపుల దయగల తండ్రి శ్రీబాబూజీకి, మెల్లగా బిడ్డల వినతులు ప్రారంభమయ్యాయి. చిన్న, పెద్ద, యువత, ముదుసలి, ఆడ,మగ, ఇలా అన్ని తరాలవారు, తమకు కావలసిన వరాలను (అవసరాలను) కోరుకుంటున్నారు. గమనిస్తే వారు-వీరు అని పేరు పేరునా చెప్పలేము గానీ వారి ద్వారా సాయి అభయం దొరకని జీవి లేదనుకోండి. సుమారు 45 ని॥లు సాగింది గురుదేవుల అనుగ్రహ ఆనంద కదంబం. ఇకవారు 'గురుచరణ్' లోనికి వెళతారనే సమయంలో అన్ని తరాలవారు ముక్తకంఠంతో గురువుగారూ! గురువుగారూ.... అని పిలుస్తుంటే మరోసారి అనిపించింది, ఇలా ఆర్తితో సద్గురుని పిలిస్తేనే కదా వ్యక్తిత్వపు పరిమితులు తొలగేదని! సద్గురు మహరాజ్ గురుచరణ్ లోపలకు వెడలిన తీరు చూడవలసిందే కాని, చెప్పనలవి కాదు. వ్యక్తి, వ్యక్తిత్వం, వయస్సు... ఇలా అన్ని పరిమితులు దాటి గురుచరణాలు చేరాలన్న ఆ



ఆర్తి అనుపమానం, అత్యంత ఆనందదాయకం. గురుదేవులు అలా వెళ్లగానే ప్రక్కనే ఉన్న రమణయ్య ఇలా అన్నారు – "కల్పతరువు అంటే ఇదే అనుకుంటానండి! ఈరోజు ఇక్కడున్న అందరూ ధన్యులే! శ్రీబాబూజీ దృష్టిలో పడనివారు లేరు – శ్రీబాబూజీకి తమ విన్నపాలను చెప్పుకోని సాయిభక్తులు లేరు. ఈరోజు ఇలా చూస్తుంటే నాకు శ్రీరామకృష్ణుల చరిత్రలో కల్పతరుదినం గుర్తొచ్చింది. మహాత్ముల మమతకు మరి ఏది సాటి? మహాత్ముల అభయానికి, అనుగ్రహానికి మరి ఏది పోటీ?" అన్నారు. కొంచెం క్రొత్తగా అనిపించినా, ఆయన భావం, ఆ అనుభూతి నచ్చింది. ఒక క్రొత్త విషయం అర్థమైంది. కల్పతరువు అంటే శ్రీబాబూజీ అని! అందుకే అన్నాడొక కవి – "ప్రేమించినా తెలియనివాడు, ప్రేమిస్తూ తెలిసినవాడు చెప్పే సత్యాన్ని విని, ప్రేమించినవాడు లోలోన పులకిస్తాడు. ఆ ఆనందానికి సరితూగగలదేమిటి?"అని. బిడ్డల చదువు నుంచి, పెద్దల ఆరోగ్యాల వరకు, విదేశాలకు వెళ్లడానికి వీసాల నుంచి 'సాయి' విజ్ఞానాన్ని ప్రసాదించమనే వినతుల వరకు అన్నీ స్వీకరించబడ్డాయి. సవినయంగా సాయిపాదాల చెంత సమర్పింపబడ్డాయి పూజ్యశ్రీబాబూజీచే! సందేహమే లేదు, ఇక అంతా మంగళకరమే! తరువాతి రోజున చిన్నారులకు తమ అమృత హస్తాలచే అన్నప్రాసన, అక్షరాభ్యాసాల కార్యక్రమం కన్నుల పండగగా సాగింది. దైవ స్వరూపులైన చిన్నారులు గురుదేవుని కరకమలాలతో ఆ దేవాధిదేవుడైన 'సాయిబాబా' నామాన్ని తమ తొలిపలుకులుగా వ్రాయించుకోవడం జరిగింది. భావితరాలైన ఆ చిన్నారుల జీవితాలు సాయిమయమై, ప్రేమ, ఆనందాల నిలయమై సాగుతాయనడంలో అతిశయోక్తి లేదు. ఆ తరువాతి రోజు ఉదయం గురుదేవులు శిరిడీ నుంచి పయనమవుతున్న సందర్భంలోనూ తమ అనుగ్రహ వీక్షణాంబుధిలో అందరినీ తడిపి, **గురుపూర్ణిమను పరిపూర్ణం** చేసారు. సద్గురు అనుగ్రహాన్ని ఎరుకలో ఉంచుకుని, సాయిభక్తి వివేకాన్ని, నిష్ఠ సబూరీలనే ఆయుధాలను చేత ధరించి విజయదశమికి పయనమవుతున్నారు గురుబంధువులు. విజయదశమి అనగానే గుర్తొచ్చేది శ్రీసాయిబాబా పుణ్యతిథి, శ్రీబాబూజీ జన్మదినోత్సవం. అంతేకాకుండా 1916వ సం॥లో శ్రీసాయిబాబా సీమోల్లంఘన చేసిన పర్వదినం. సాటివారిపట్ల అసూయ, ద్వేషాలను సంకుచిత కుల,మత మానసిక అవరోధాలనే సీమలను ఉల్లంఘించమని శ్రీసాయి మనకు చెప్పిన సూచనాపూర్వక సుదినం. సాయిభక్తిపథంలో మనకు అవరోధాలుగా ఉన్న అన్ని అంశాలపైనా పోరు సలిపే ప్రయత్నంలో మనకు శ్రీబాబూజీ అనుగ్రహమే తోడూ, నీడా! 'గురుకృప' ఉంటే సాధ్యం కానిది ఏముంది? పదండి ఒక్క అడుగు మనం వేద్దాం! 'పది' అడుగులు బిడ్డవైపు వేయడానికి 'సాయిమాయి' సదా సిద్ధం! అందుకు మనపై శ్రీబాబూజీ చూపే ప్రేమే నిలువుటద్దం!

సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**

సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**

## అనుగ్రహ దర్శనాంబుధి



పిలిస్తే పలికే దైవం శ్రీ శిరిడీ సాయినాధులు, తలిస్తే రక్షించే దైవం, సద్గురువు శ్రీ సాయినాథుని శరత్‌బాబూజీగారు. నాపేరు పద్మ. మాది రాజమండ్రి. మేము ఇటీవల ఇల్లు కొన్నాము. మేము కొనేటప్పటికి ఆ ఇల్లు కోర్టులో ఉన్నది. ఆ విషయం తెలియక ఆ ఇల్లు కొన్నాము. కొంతకాలము తరువాత కోర్టు నుండి 'ఆ ఇల్లు మీకు చెల్లదు. ఇల్లు కోర్టుకు అప్పచెప్పండి' అని ఆర్డర్సు వచ్చాయి. ఆ ఇల్లు నిలబెట్టుకోవడం కోసం చాలామంది లాయర్ల దగ్గరకు వెళ్లాము. ఈ ఇల్లు మీకు చెల్లదు కోర్టుకు అప్పగించండి! అని లాయర్లు చెప్పారు. మాది కిరాణాషాపు. దానిమీద సంపాదించినదంతా పెట్టి ఇల్లు కొన్నాము. ఇంకా మా దగ్గర ఏమీ లేదు. ఇద్దరు పిల్లలు. వాళ్లని ఎలా పెంచాలి అనే బాధతో రోజూ ఏడుస్తూ, చనిపోవాలి అని అనుకున్నాము. నా బాధ చూసి నా స్నేహితులు దానవాయిపేటలో సత్సంగం జరుగుతున్నది, రమ్మని తీసుకువెళ్లారు. నేను మొదటిసారిగా గురువుగారిని అక్కడే చూసాను. బాబా–గురువుగారికి నా బాధనంతా చెప్పుకున్నాను. కోర్టువారి ఆర్డరువలన ఇల్లు, షాపు ఖాళీ చేయవలసి వచ్చింది. ఉండడానికి ఇల్లు లేక, షాపు కూడా పోయి, జీవనోపాధి లేక చాలా బాధలు పడ్డాము. ఊరు వదలి వెళ్లిపోదామని అనుకున్నాము. ఎక్కడైనా క్యాంటీన్ పెట్టి బ్రతుకుతెరువు చూసుకుందామని అనుకున్నాము. కాని, ఏదీ కుదరలేదు. ఈలోగా గురుపౌర్ణమికి శిరిడీ వచ్చాను. గురువుగారి దర్శనం చేసుకున్నాను. **గురువుగారికి ఏమీ చెప్పలేక ఏడ్చేసాను.** శిరిడ నుండి ఇంటికి తిరిగి వచ్చేసరికి కోర్టులో ఇల్లు పోయి, షాపు మిగిలింది. షాపులో పెట్టుబడికి కూడా డబ్బులు లేవు. నేను అడగకుండానే ఒక పెద్దాయన వచ్చి, 3,000 రూ॥లు ఇచ్చి, వ్యాపారము మొదలు పెట్టమని చెప్పారు. వ్యాపారము మొదలు పెట్టిన తరువాత ఆ షాపు, పైన చిన్న ఇల్లు కూడా గురువుగారు ఇచ్చారు. నా పిల్లలను చదివించే స్థోమత కూడా ఈ రోజున గురువుగారు ఇచ్చారు. మా పెద్దపాప ఇంజనీరింగ్ మూడవ సంవత్సరము, చిన్నపాప ఇంటర్ మొదటి సంవత్సరము చదువుతున్నారు. నా బాధలతో గురువుగారిని అడగలేక ఏడుస్తూ ఉండిపోయాను. అయినప్పటికి **మా బాధలన్నీ తీర్చి** మమ్మల్ని ఈ స్థితిలో ఉంచిన గురువుగారికి మా కుటుంబం శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం. **పద్మ, రాజమండ్రి.**

## బాబా-బాబూజీ-బాబులు

నా పేరు మంగవేణి, నా భర్త పేరు గోపి. మాది మహాలక్ష్మిపురం గ్రామం, భీమునిపట్నం. గురువుగారి దగ్గరకు వచ్చిన తరువాత నా అనుభవమును గురుబంధువులతో పంచుకుంటున్నందుకు చాలా సంతోషముగా ఉంది. మాకు మే నెల 8వ తారీఖు, 1998వ సం॥లో వివాహం జరిగింది. మాకు చాలాకాలం వరకు పిల్లలు కలుగలేదు. మా ఆడపడుచు ఋషికొండలో సాయిబాబా సత్సంగము జరుగుచున్నదని, అక్కడకు వచ్చి గురువుగారికి చెప్పుకోమని నాతో చాలాసార్లు చెప్పింది. ఋషికొండ సత్సంగంలో నాకు లక్ష్మి



ఆంటీగారిని పరిచయం చేసింది. అప్పుడు నాకు బాబా మరియు గురువుగారి ఫోటోలను కూడా ఇచ్చారు. కాని, నేను నా పెళ్ళికి ముందు నుండి బాబాకు పూజలు, ఉపవాసాలు చేస్తూ ఉండేదాన్ని. అలాంటపుడు బాబా-గురువుగారు అంటూ వేరే పూజలు ఎందుకు అని సంవత్సరం పాటు ఆ ఫోటోలను టేబుల్ సొరుగులో ఉంచేసాను. తను మా ఇంటికి వచ్చినపుడు బాబా-గురువుగారి నామం చెప్పుకోమని చెపుతూ ఉండేది. కానీ వినేదాన్ని కాదు. సంవత్సరం పోయాక నాలో మార్పు వచ్చి బాబా-గురుదేవులకు నమస్కరిస్తూ ఉండేదాన్ని. నాకు ఏ సమస్య వచ్చినా బాబా-గురువుగారికి చెప్పుకుంటూ ఉండేదాన్ని. 2004వ సం॥ దసరాకి మా ఆడపడుచు వాళ్ల శిరిడీకి బయలుదేరుతున్నాము అని చెప్పారు. వాళ్లతో పాటు మేము కూడా శిరిడీకి బయలుదేరాము. అక్కడ లక్ష్మిఆంటీ మరియు మా శ్రీను అన్నయ్య చెప్పినట్లు గురువుగారి పాద దర్శనానికి వెళ్లాము. మాకు అప్పటివరకు పిల్లలు కలుగలేదు. చాలామంది డాక్టర్ల వద్దకు వెళ్లి చెకప్ చేయించుకున్నాము. మేము గురువుగారి పాద దర్శనానికి వెళ్లేముందు ఒక ఆవిడ ఇద్దరు బాబులను తీసుకొని గురువుగారి దగ్గరకు వచ్చారు. **నేను కూడా నా మనసులో గురువుగార్కి నాకు ఇద్దరు బాబులు కావాలని చెప్పుకున్నాను**. మా భార్యాభర్తలిద్దరికి గురువుగారి పాద దర్శనం దొరికింది.

భీమిలిలో గల గవర్రాజు గారి ఇంటివద్ద సత్సంగం జరుగుతుండేది. నేను ఆ సత్సంగానికి శుక్రవారంనాడు వెళుతూ ఉండేదాన్ని. ఒక్కొక్కపుడు గవర్రాజుగారు లేని సమయంలో నేను అక్కడ సత్సంగం చేసేదాన్ని. శిరిడీ నుండి వచ్చిన తరువాత కూడా మరల హాస్పిటల్‌కి వెళ్లి పిల్లల కోసం చెక్ చేయించు కున్నాము. ఎప్పటిలాగే పుడితే పుడతారు, లేదంటే లేదు అని చెప్పారు డాక్టర్లు. ఇంటికి వచ్చి చాలా బాధ పడ్డాను. గురువుగారికి, బాబాకు నా సమస్య చెప్పుకున్నాను. మరల కొన్నాళ్ల తరువాత హాస్పిటల్‌కి చెకప్‌కి వెళ్లినపుడు “మీకు పిల్లలు పుట్టే అవకాశం ఉంది” అని డాక్టర్స్ చెప్పారు. 2006వ సం॥ ఏప్రిల్ నెలలో డాక్టర్స్ నాకు శుభవార్త చెప్పారు. మాకు జనవరి 9, 2007వ సం॥లో నాకు ఇద్దరు బాబులు. నేను కోరుకున్నట్టు గురువుగారు నాకు ఇద్దరు బాబులను ఇచ్చారు. **వారిని పవన్‌సాయి, పవన్ శరత్ అని పిలుచుకుంటున్నాము.** బాబులను ఇచ్చిన బాబా-బాబూజీలకు సప్రేమ నమస్సులు. ***మంగవేణి, భీమిలి***

## మొండి వ్యాధి - కాపాడుతున్న ఊదీ

మమ్ములను కంటికి రెప్పలా అనుక్షణం కాపాడుతూ, నా జీవితంలో అవసరమైనవి అనుగ్రహిస్తున్న పూజ్యశ్రీ బాబూజీ చరణాలకు సవినయంగా నమస్కరిస్తూ, నా పేరు ఉదయలక్ష్మి. మా వారిపేరు యడవల్లి సీతారామ మోహనశర్మ. రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన తదుపరి విజయవాడ నుండి హైదరాబాద్ మా బాబు దగ్గరకు వచ్చి ఉన్నాము. మావారికి భగవంతుని యందు నమ్మకమున్నది. నాకు సాయిబాబా యందు, గురుదేవులయందు అచంచలమైన భక్తి విశ్వాసములు ఉండుట వలన ఆ



సాయినాథుని అనేక విధముల కీర్తించుకొనుచున్నాను. మా వారికి 2007 సం॥ జూన్‌లో ట్రిజినల్ న్యూరాలజీ అను ఒక వ్యాధి ఉందని తెలిసింది. ఇది మెదడునుండి నరముల ద్వారా సంకేతము పంపు నాడీ వ్యవస్థ, రుగ్మతకు గురి అగుటచే వస్తుందని చెప్పారు. ఆయనను ఇద్దరు, ముగ్గురు డాక్టర్లకు చూపిస్తే, ఈ వ్యాధికి ఉపశమనమేగాని, మందులతో తగ్గదని తెలియజేశారు. ఒకానొక సందర్భమున మావారు విజయవాడ నుండి హైదరాబాద్ బస్సులో వస్తున్నపుడు 6గం॥లకు డా॥ విక్రమశర్మ, న్యూరో ఫిజీషియన్ అను బోర్డు హైదరాబాదులో కనిపించిందట. ఆ విషయం హైదరాబాదు వచ్చాక మా వియ్యంకుడు సుబ్రహ్మణ్యంగారిని సంప్రదించి, ఈ విక్రమశర్మ ఎవరు, ఆయన గురించి కొంచెం ఎంక్వయిరీ చేసి, వివరాలు సేకరించమని కోరగా ఆయన సేకరించి, తెచ్చిన మీదట ఆ డాక్టరుగారి దగ్గరకు వెళ్లి చూపించి, ఆయనతో 'అయ్యా! మీ బోర్డు చూసి, మీ దగ్గరకు వచ్చాము' అనగా ఆ డాక్టరుగారు 'నా బోర్డు హైదరాబాదులో లేదు, నేను ఏ బోర్డు పెట్టలేదు' అని 'నేను కొత్తగా లండన్‌లో చదువుపూర్తి చేసి వచ్చాను' అని తెలిపారు. ఆ డాక్టరుగారి దగ్గర చూపించుకొని వచ్చారు. నేను గురువుగారికి ఒక లెటర్ ద్వారా నా బాధను విన్నవించుకొని ఒక సంవత్సరం గనుక మా వారికి ఈ నొప్పి రాకపోతే నేను గురుకృపకు నా అనుభవాన్ని పంపుతానని గురువుగారికి లెటర్ ద్వారా చెప్పుకున్నాను. మావారి రుగ్మతను శ్రీబాబూజీ తొలగించారని నా విశ్వాసం. ఇందుకు నేను సాయినాథునికి, గురుదేవులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ప్రతిరోజూ ఊదీని మావారి నుదుటన ఉంచుతాను. సద్గురు పాదధూళి మమ్ములను కాపాడుతున్న ఈ తీరును మీతో పంచుకుంటూ.....

**ఉదయలక్ష్మి, హైదరాబాద్**

మమతల మాలికలా అల్లుకుంది నా మది నీ చుట్టూ! నీ రూపమే మెదిలింది నా కనుపాపల చుట్టూ! అహానికి, కోపానికి లోబడి ఉన్న నన్ను నీ దగ్గరకి చేర్చుకున్నావు, నీ ప్రేమానురాగాలను పెదజల్లావు. నాచుట్టూ చేసే ప్రతి పనిలోను, వినే ప్రతి మాటలోను, చూసే ప్రతీ మనిషిలోను నిన్నే చూడాలి, చూస్తాను. అలా నువ్వే చేయాలి. కన్నుల్లో నింపుకున్న నీ రూపాన్ని, గుండెల్లో దాచుకున్న నీ ప్రతిరూపాన్ని ఎప్పటికీ చెరగనీకు. నాలోని అహాన్ని పూర్తిగా మింగివేసి నీ ప్రేమని నాలో నిండుగా నింపు తండ్రీ! తల్లివి, తండ్రివి నీవు అయి నడుపు, తల్లిదండ్రులను మరువనీకు. కష్టసుఖాలు కలగలసిన ఈ జీవితం కష్టం వచ్చినపుడు కుంగిపోకుండా, సుఖం వచ్చినపుడు పొంగిపోకుండా, ఎల్లప్పుడూ నీ దీవెనలు నాపై కురిపించు తండ్రీ!

**– హిమాంశు, గాజువాక**



# బదిలీ(ల) బాధలు - సద్గురుని బోధలు

పూజ్య గురుదేవుల పాదపద్మములకు నమస్కారములు. నాపేరు విమల. నేను తిరుపతి సత్సంగం నుండి ఈ అనుభవాన్ని పంచుకుంటున్నాను. నేను టీచర్‌గా జాబ్ చేస్తున్నాను. బాబా-గురూజీ నా జీవిత విధానాన్నే మార్చి వేసారు. నాకు కావలసినవన్నీ ఇచ్చారు. 2005వ సం॥ నవంబర్‌లో టీచర్ల జాబ్ కౌన్సిలింగ్ జరిగింది. అప్పటికి నాకింకా రిటైర్‌మెంట్ సమయం 4 సం॥ల 8 నెలలు ఉంది. కౌన్సిలింగ్‌కి వెళ్లే ముందు గురువుగారికి చెప్పుకొని, ఆయన ఆశీస్సులు అడిగి వెళ్లాను. నాకు వచ్చిన ప్లేస్ ఒక ఫారెస్ట్ ఏరియాలో చిన్న స్కూల్. అది ఆడవారు వెళ్లడానికి వీలుకాదు. ఐదు కి.మీ. అడవిలోనే వెళ్లాలి. నేను జాయిన్ అయ్యి, సెలవు పెట్టాను. తిరువణ్ణామలై వెళ్లి, గురువుగారికి చెప్పుకున్నాను. వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంటాను గురువుగారూ! అన్నాను. గురువుగారు తల ఊపారు.

శిరిడీకి వెళ్లాను. బాబా సమాధి వద్ద నా జాబ్‌కు విఆర్ఎస్ ఇస్తున్నట్లు బాబాకు చెప్పుకున్నాను. తరువాత గురువుగారు తిరుమలలో ఉన్నట్లు తెలిసింది. తిరుమలకు వెళ్లాను. నేను వెళ్లడానికి ముందే గురువుగారు బయలుదేరారని తెలిసింది. రవిగారిని అడిగితే ఎంతో ఆశగా వచ్చారు, నమస్కారం చేసుకొని వెళ్లమన్నారు. గురువుగారి ఫోటో వద్ద విఆర్ఎస్ అప్లికేషన్ పెట్టాను. నమస్కారం చేసుకున్నాను.

విఆర్ఎస్ అప్లికేషన్ తెచ్చి, చిత్తూరు డిఇవోగారి ఆఫీసుకు పంపాను. విఆర్ఎస్‌కు వారు తిరస్కరించి, మూడు నెలలు ఉద్యోగం చేసాక, విఆర్ఎస్ ఇవ్వమన్నారు. మూడు రోజులకే నాకు భయం. మూడు నెలలు ఎలా వెళ్లేది? ఒకటిన్నర సంవత్సరం సెలవు పెట్టాను. తరువాత ఉద్యోగంలో జాయిన్ అయ్యాను. బాబా-గురువుగారి ఆశీస్సులతో నేను అడవిలో ఉన్న ఆ బడిలోనే జాబ్ చేసాను. అందరూ ఎలా జాబ్ చేస్తుంది, ఇంత దూరం వెళ్లి అన్నారు. బాబా-గురువుగారి ఆశీస్సులతో నా జీవితం ఆనందంగా, సుఖంగా సాగుతున్నది. మనకు ఏది ఏ సమయానికి కావాలి, అది బాబా-గురువుగారు అమర్చి పెడతారు.

మనం కోరుకునేది ఏదీ సరియైనది కాదు, నిజంగా నాకు ఏది కావాలో బాబాకు తెలుసు. భారం వేసి నిశ్చింతగా ఉంటే వారు కావలసినది ఇస్తారు. ప్రస్తుతం నాకు అక్కడినుండి ఆగష్టు 27న బదిలీ జరిగింది. ఇప్పుడు ఒక మంచి గ్రామం. స్కూలులో అసిస్టెంట్, విద్యార్థులు చక్కగా ఉన్నారు. ఇక నా రిటైర్‌మెంట్ 2010 ఆగష్టులో. మనకోసం అంత శ్రద్ధ తీసుకునేవారు బాబా-గురువుగారు తప్ప ఎవ్వరూ ఉండరు. నా శేష జీవితం బాబా-గురువుగార్ల ధ్యాసలోనే సంతోషంగా, సుఖంగా గడవాలని ఆశిస్తూ....

**విమల, తిరుపతి**



# లోటు - ఏర్పాటు

గురుదేవులు శ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ పాదపద్మములకు నమస్కరించుకుంటూ, గురుదేవుల లీలలను గురుబంధువులకు తెలుపుకుంటున్నాను. నాపేరు కళ్యాణి. మాది గాజువాక సత్సంగం. గురుబంధువుల సహాయంతో 2003వ సం॥లో సత్సంగానికి పరిచయం చేసారు బాబా. అప్పటినుండి క్రమం తప్పకుండా వెళ్లేదాన్ని. అప్పటి మాకు చాలా ఇబ్బందులు ఉండి, శారీరకంగా, కుటుంబపరంగా అసలు తట్టుకునే పరిస్థితి లేదు. మేము అప్పుడు అక్కిరెడ్డిపాలెంలో సొంతఇంటిలో ఉమ్మడి కుటుంబంలో ఉండేవాళ్లం. ఒకసారి "బాబా! పరిస్థితి దారుణంగా ఉంది. తల్లిదండ్రులతో చెప్పుకోలేను. అలా అని తట్టుకునే శక్తి, నాకు, నా శరీరానికి లేవు". అని వేడుకున్నాను. అప్పుడు హఠాత్తుగా తల్లిలా ఝాన్సీగారు గుర్తుకు వచ్చారు. ఫోను చేసి జరిగినది చెప్పి, ఆ ఎస్‌టిడి బూత్‌లోనే ఎంత ఏడ్చానో గురువుగారికి తెలుసు, సగం బాధ తీరింది. అప్పుడు ఝాన్సీగారు 'బాబా-గురువుగారు ఉన్నారు, మీ కుటుంబాన్ని కాపాడతారు, ధైర్యంగా ఉండమని' చెప్పారు. మేము ఉంటున్న ఉమ్మడి కుటుంబం నుంచి బయటకు వచ్చి, సొంతగా, ఒంటరిగా బ్రతికే స్థితి లేదు. నేను, మావారు గురువుగారికి చెప్పుకున్నాం, "మీరు సంకల్పిస్తే ఎలా అయినా ఉంటామని". ఆ తరువాత మాకు తెలియని ఏరియా శ్రామిక నగర్‌లో మా శక్తికి తగ్గ రెండు గదులు ఇల్లు 600రూ॥లకు బాబా-గురువుగారు ఇప్పించారు. 2006, జూన్‌లో అద్దె ఇంటికి వచ్చేసాము. ఒక సం॥ ఒక క్షణంలా గడిచిపోయింది.

2007 మే 27న గురువుగారి దర్శనానికి మావారు వెళ్లారు. అప్పటికి దుబాయ్ వెళ్లాలని అనుకుంటున్నారు. గురువుగారిని దుబాయ్ పంపించమని అడిగారు. జూలై 3న వైజాగ్‌లో బయలుదేరి, 3,4 రోజుల తరువాత దుబాయ్ చేరుకున్నారు. అంతా బాగానే ఉంది, 1 సం॥ 6 నెలల తరువాత ఆ కంపెనీ మేనేజర్ సడన్‌గా వచ్చి ఇండియా వెళ్లిపో, నువ్వే రాజీనామా లెటర్ కూడా ఇవ్వాలి అని ఒత్తిడి చేసి కొత్తగా ఒక అబ్బాయిని తీసుకువచ్చి, ట్రైనింగ్ ఇవ్వు, నీ సీటులో ఈ అబ్బాయిని వేసుకున్నాం అని చెప్పి వెళ్లిపోయారట. మావారు కొంచెమైనా భయపడకుండా రూమ్‌కి వచ్చి, బాబా-గురువుగారి చిత్రపటాలవద్ద జరిగినదంతా చెప్పుకున్నారు. బాబా-గురువుగారు ఉండగా నాకు ఎందుకు భయం అని ధైర్యంతో ఉన్నారు. మూడు రోజుల తరువాత, ఆ మేనేజర్ వచ్చి, నీ జాబ్ కంటిన్యూ చేసుకో!, ఇండియా వెళ్లనక్కరలేదు, అని చెప్పారట, ఆ విధంగా మా ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దారు. వైజాగ్‌లో నన్ను, పాపని కంటికి రెప్పలా కాపాడుతూ, దుబాయ్‌లో మా వారికి అన్నీ సమకూర్చి, దేనికీ లోటు లేకుండా మాకుటుంబాన్ని కాపాడుతూ వస్తున్నారు. ఎక్కడా కష్టపడకుండా, బాధపడకుండా, ఆనందమైన జీవితాన్ని బాబా-గురుదేవులు మాకు ప్రసాదించారు.

***కళ్యాణి, గాజువాక***



# పంచుకునే నైజం - ప్రేమకు బీజం

పూజ్యులైన గురుదేవుల పాదపద్మములకు నమస్కరించి నా స్నేహితురాలికి జరిగిన అనుభవం మీతో పంచుకుంటున్నాను. ఈ సంఘటన గత డిసెంబరులో జరిగినది. నా స్నేహితురాలు కళ్యాణి, మేము ఒకే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాము. తనకు చిన్న బాబు ఉన్నాడు. ఆ అమ్మాయి నాతో అన్ని విషయాలు మాట్లాడేది. తన ఇబ్బందులన్నీ చెప్పుకునేది. రోజూ వచ్చి కూర్చొనేది. వాళ్ల బాబుకు పుట్టినప్పటి నుండి ఆస్మా ఉండేది. చాలా మందులు వాడారు. చలికాలం ఇంకా ఎక్కువగా ఉండేది. వాడితో చాలా కష్టపడుతుండేది. నేను చెప్పేదాన్ని "రోజూ బాబా మందిరానికి వెళ్లు. బాబాతో చెప్పుకో!" అని. మాకు దగ్గరలోనే బాబా మందిరం ఉంది. అలాగే వెళ్లేది. బాబును స్కూల్‌లో వేసింది. నేను బాబా, గురువుగారి విషయాలు చెప్పేదాన్ని. ఒకరోజు గురువుగారి ఫోటో చూసి, అడిగింది ఎవరు అని. నేను చెప్పాను "శిరిడీ వెళ్లినపుడు అక్కడ గురువుగారిని దర్శించుకుంటాము" అని. మీ పిల్లలకు గురువుగారు అంటే ఇష్టం కదా అని అడిగేది. అవును అని మాకు జరిగిన అనుభవాలు చెప్పాను. ఇంకా గురుకృప చదవమని, నీకు ఏ బాధ వచ్చినా బాబా-గురువుగార్లకు చెప్పుకోమని రోజూ చెప్పేదాన్ని. దసరాకు శిరిడీకి వస్తుంటే "ఆంటీ నాకు గురువుగారి ఫోటో తీసుకురమ్మని" చెప్పింది. నేను బాబా-గురువుగారితో తన గురించి చెప్పాను. గురువుగారి ఫోటో తెచ్చి ఇచ్చాను. చాలా సంతోషించింది. మేమంటే తనకు చాలా ఇష్టం. ఒకరోజు పనిఅమ్మాయి వస్తుందని బట్టలు నానబెట్టింది. తను వచ్చి ఉతికి వెళ్లిపోయింది. చాలా తొందరగా వెళ్లిపోయింది. కళ్యాణి భర్త ఫోన్ చేసి, "కళ్యాణీ! ప్యాంట్ జేబులో డబ్బు ఉంది. ఉతకడానికి వేస్తావేమో చూడు" అని. వెంటనే ఈమె "ఎంత ఉంది?" అని అడిగింది. "పన్నెండు వేలున్నాయి" అన్నారట. ఇక ఈమెకు కంగారు వచ్చి పనిఅమ్మాయి ఎక్కడెక్కడ పని చేస్తుందో అక్కడంతా అడిగింది కాని ఆ అమ్మాయి ఎక్కడా లేదు. ఆరోజు తొందరగా వెళ్లిపోయింది. ఆయన ఫోన్ చేయగానే ముందు ప్యాంట్ జేబులో వెతికిందిట. ఆరు వేలే ఉన్నాయి అని ఫోన్ చేసి చెప్పగా, ఆయన వెంటనే ఇంటికి వచ్చి, "చూసుకోవద్దా" అని కోప్పడి, "సరే ఇక ఆమెను అడగవద్దు, పనివాళ్లు గొడవకొస్తారు, ఇక ఆమెను పనికి రావద్దు" అని చెప్పమన్నారట. ఆయన ఆఫీసుకు వెళ్లిపోయారు. ఈమెకు చాలా చికాకుగా ఉండి, అప్పుడు గుర్తుకు వచ్చిందట, గురువుగారితో చెప్పుకోవాలని. గురువుగారి ఫోటో దగ్గర నుంచొని "బాబూజీ ఆమె ఆ డబ్బు తీసుకొచ్చి ఇవ్వాలి" అని చెప్పిందట. ఇక మరుసటిరోజు ఉదయం కళ్యాణి భర్త వెళుతూ "పనిఅమ్మాయిని డబ్బు అడగవద్దు" అని చెప్పారట. కాని ఈ అమ్మాయి ఎదురింటి ఆమెను తెచ్చి కూర్చోబెట్టుకుంది ధైర్యం కోసం. పనిఅమ్మాయి వచ్చిందట. వెంటనే అడిగింది "ఏంటి నువ్వు ఇలా డబ్బు తీసుకుపోవచ్చా" అని. "ఉండుండు గొడవ చేయకు, నీ డబ్బులు తీసుకొచ్చాను, నీకు ఎంత గుర్తు ఉందో చూద్దాం అని తీసాను"



అన్నదట. ఇలా చేయడం తప్పుకదా అంటే, అప్పుడన్నదట తప్పే అని. అన్నీ ఉన్నాయో, లేదో చూసుకోమని. “నాకు ఇంటికి వెళ్లిన దగ్గర నుండి ఏదో తెలియని చికాకు, తలంతా భారంగా అయిపోయి, మీ ఇంటికి వచ్చే వరకు కూడా నాకేదో అయిపోయింది. నీ చేతిలో డబ్బులు పెట్టాక స్థిమితంగా ఉంది” అన్నదట. కాని ‘నన్ను పనిలోంచి తీసేయవద్దు’ అని బ్రతిమలాడుకున్నదట. చాలా సంతోషంతో మా ఇంటికి వచ్చి, మా అమ్మతో చెప్పిందట. నేను అప్పుడు చెన్నైలో ఉన్నాను. హైదరాబాద్ వెళ్లగానే మా అమ్మ చెప్పింది. కళ్యాణి కూడా వచ్చి నాకు చెప్పింది. “నిజంగా గురువుగారు ఉన్నారని నాకు నమ్మకం కలిగింది” అని. అంతేగాక, “ఇంట్లో చికాకులు తగ్గాయి. బాబుకు హోమియోపతి మందు వాడుతున్నాము. చాలావరకు తగ్గినది. బాబు ఇప్పుడు యుకెజి చదువుతున్నాడు, ఇప్పుడు మంచి ర్యాంకు కూడా వచ్చింది. అన్నీ గురువుగారితో చెప్పుకుంటున్నాం ఆంటీ” అని చెప్పింది. ఆమె చాలా సంతోషించింది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. డబ్బులు ఇంటికి తీసుకుపోయి మళ్లీ తెచ్చింది అంటే ఇది అంతా గురువుగారి కృపే. నాకు, పటానికి బేధం లేదు అని బాబా చరిత్రలో ఉంది. నా స్నేహితురాలు కళ్యాణి ఇప్పటివరకు శిరిడీకి పోలేదు, బాబాను మందిరాలలోనే చూసింది. గురువుగారిని ఫొటోలోనే చూసింది. “నేనుండగా భయమేల?” అని అభయమిచ్చిన బాబా అందరి అవసరాలను తీరుస్తున్నారు. ప్రతి రోజూ ప్రతి చిన్న విషయం బాబా పరంగా ఒక అనుభవమే. నా ఆజ్ఞలేక ఆకైనా కదలదు అన్నారు బాబా. ప్రేమతో నమస్కరించుకొంటూ, మీ గురుబంధువు

–లక్ష్మీ

## మృత్యుంజయం - సాయిభక్త విజయం

పూజ్య గురుదేవులు సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ గారి దివ్య చరణారవిందములకు సాష్టాంగ నమస్కారములు చేసుకుంటూ గురుదేవులు మమ్ములను రక్షించిన తీరును గురుబంధువులకు తెలుపుకుంటున్నాను. రవీంద్రనాథ్‌గారు, శ్రీను, నేను, మా అబ్బాయి కలిసి గురుపూర్ణిమకు శిరిడీ బయలుదేరాము. మన్మాడ్‌లో ట్రెయిన్ దిగి, అక్కడ నుండి వెహికిల్స్ మాట్లాడుకుని శిరిడీ బయలుదేరాము. మేము శిరిడీకి బయలుదేరిన సమయం అర్ధరాత్రి రెండున్నర గంటలు. వరుసగా అందరం సాయిబాబా నామం చెప్పుకుంటున్నాం. సాయినామం జరుగుతుంది. ఒక్కసారిగా పెద్దశబ్దం వచ్చింది. మేము వెళు తున్న వ్యాన్ ఏదో రాయి ఎక్కినట్లుగా దిగాక తెలిసింది. గురుదేవుల ఆశీస్సుల వలన తిరగబడవలసిన వ్యాన్ కుడివైపుకు ఒరిగిపోయింది. తిరగబడి ఎంతో ప్రమాదానికి గురికావలసిన వ్యాన్‌ను గురుదేవులే ఆపారు అన్నది నా భావం, కాని సాయినామం మాత్రం ఆగలేదు. వ్యాన్‌లో ఎవ్వరూ కూడా భయపడలేదు. దిగిన తరువాత అనిపించింది. చాలా పెద్ద ప్రమాదం నుండి గురుదేవులు తప్పించి, మమ్ము రక్షించి,



కాపాడారు అని. ఇక్కడ నా మనసులో మాట మీకు వ్రాసుకుంటున్నాను. గురుదేవులు రచించిన సాయిభక్తిసాధన రహస్యంలో శ్రీసాయిభక్తులకు శ్రీసాయినాథుని కన్నా మృత్యుంజయుడెవ్వరు, సాయినామాన్ని మించిన మృత్యుంజయ మంత్రమేమున్నది" అని వ్రాసిన మాటలు సత్యోక్షరాలు. ఆ సాయినామమే మృత్యుంజయ మంత్రంలా గురుదేవుల ఆశీస్సులతో మేమందరం క్షేమంగా శిరిడీ చేరుకునేటట్లు చేసింది. ఇలాంటి అద్భుత సద్గురువుని ప్రసాదించిన బాబాకు, మన నిత్య జీవితంలో ప్రతి పనిలో, సత్సంగంలో, అనుక్షణం సాయిస్మరణకై సాయిబాబా నామాన్ని ప్రసాదించిన గురుదేవులకు నా హృదయపూర్వక సాష్టాంగ నమస్కారములు తెలియచేసుకుంటున్నాను. **రాజు, భీమిలి**

# సత్య సంకలనాలు

**"ఎందుకొచ్చినట్లు, పిడకలేరుకోవడానికా? సద్గురువును తెలుసుకో!" – శ్రీసాయిబాబా**

**"గురువే తల్లియు దండ్రియు। గురువే దైవంబు జీవకోటికి నెల్లన్!**
**గురువు వినా, దైవంబీ ధరలో గలడనచు, దలప దగదే మనసా?" – సూరినాగమ్మగారు**

సత్య సంకలనాలు – ఈ శీర్షిక ప్రధానోద్దేశ్యానికి పై వాక్కులే స్ఫూర్తి. సద్గురువును తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా ఈ చరాచర జగత్తులో ఉన్న ఒకే ఒక్క సద్వస్తువు (సత్యం) సద్గురువేనన్న తలంపుతోనే ఈ శీర్షిక గురుబంధువుల ముందుకు వచ్చింది. 'సంకలనాలు'గా అందిస్తోంది మహాత్ముల వాణినే! అలా మహాత్ముల ఆచరణ–బోధలనే ప్రమాణంగా గురుతత్త్వంలోని కొన్ని కోణాలను ఆవిష్కరించుకునే చక్కటి కూర్పు ఇది. క్రితం సంచికలలో గురుదర్శన మహిమను, గురునామ ప్రాశస్త్యాన్ని పంచుకుంటే, ఈ సంచికలో 'గురుచరణ' విశిష్టతను తెలుసుకునే ఒక చిరుప్రయత్నం. ఇలా సంకలనంగా చూస్తేనే అవగతమవుతుందా అంటే అసందర్భం కాదని అనుకుంటూ శ్రీరామకృష్ణుల చరిత్రలో రామకృష్ణులు పాడే ఈ కీర్తన ఇంకో కోణం. రామకృష్ణులు **"వెర్రి వానిని చేయవే నీ ప్రేమలోన, పిచ్చివానిని చేయవే, నను గన్నతల్లి! ఏల జ్ఞానము ఏల తర్కము....."** నిజమే సద్గురు ఆనందామృతరసానుభవ సాగరంలో ఒక్కశాతం మునిగినా ఈ జ్ఞానార్జన అవసరం కలుగదు. అయితే 'అభ్యాసము కూసువిద్య అని పెద్దల ఉవాచ కదా!'

మహాత్ముని రూపం అంత చక్కగా దర్శనమిస్తుంటే ప్రతీ శాస్త్రవాక్యము, మహాత్ముల ఆచరణ మాత్రం మహాత్ముని చరణాలకే ఎందుకు అంత ప్రాధాన్యమిస్తున్నాయి – మానవాకృతి దాల్చిన భగవత్ తత్త్వం ముందు మోకరిల్లి శరణు వేడడం ఒక భావంగా ఉంటే, అనంతుడైన సద్గురువును దర్శించుకోవడానికై



సద్గురు చరణాలు చేరి తలపైకెత్తి వారి అనంత స్వరూపాన్ని దర్శించుకోవాలని కొందరి భావం. ఏతా వాతా తేలేదేమంటే శరణాగతి పథంలో సద్గురు చరణాలకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదని చెప్పాలి. అందుకే సాయి అన్నారు **"పరమ పవిత్రమైన ఈ పాదాలు ఆద్యంతాలు లేనివి"** అని. పోతనామాత్యుడు భాగవత ప్రారంభంలోనే చెప్పాడు **"నీ పాద కమల సేవయు... నీ పాదార్చకుల తోడి నెయ్యము"** అని. గురుచరణాల నాశ్రయించడమే కాదు, ఆ చరణసేవలో పునీతమయ్యే భక్తులతో స్నేహము కూడా ప్రసాదించమంటాడు. శ్రీసాయి చరణదాసుడైన దాసగణు ఇంకొక అడుగు ముందుకేసి "బాబా నీ పాదధూళితోపాటు నీ భక్తుల పాదధూళి కూడా స్వీకరించుకునే చీపురుగా నన్ను స్వీకరించ"మంటాడు. స్కాంద పురాణంలోని "గురుగీత" ఇలా చెపుతోంది – "సప్తసాగరాలలో స్నానమాచరించడం వలన ఎట్టి ఫలము లభిస్తుందో అది గురు పవిత్ర చరణ తీర్థములోని ఒక బొట్టులో వెయ్యవ వంతుకు సమానము". **"ధ్యానానికి–గురుస్వరూపం, అర్చనకు–గురుచరణాలు, జపమునకు–గురువాక్యము, మోక్షమునకు–గురుకృప మూలములు"**. గురుస్వరూపము సర్వశ్రేష్ఠ తీర్థము (యాత్ర). గురు పాదారవిందములు సర్వతీర్థముల స్వరూపము. ఇక శ్రీసాయి ఆరతి గీతాల్లో అయితే ఇదిగో ఎన్ని 'చరణ'సుమాలో అవధరించండి. ఆరతుల ప్రారంభమే ఇలా అవుతుంది – 'కరములు జోడించి నీ చరణములపై శిరసునుంచాను – నా వినతి విను' **'జోదునియా కర చరణి ఠేవిలా మాథా! 'జడోచిత్త తుఝే పాయీ'** అంటూ మా జడ చిత్తములు ఎప్పుడూ నీ పాదాలపై నిలవాలని, **'సాయినాథ గురు మాఝే ఆయీ' మజలాఠావ ద్యావా పాయీ'** అంటూ తల్లివైన సాయి, మీ పాదాల దగ్గర ఆశ్రయమివ్వండి అంటూ **'జరీ గురుపదా ధరీసుదృఢ భక్తినేతోమనా'** గురుపాదాలను దృఢ భక్తితో మనసులో ధరించకుంటే తనకు తాను ఎలాంటి శ్రేయస్సునూ సాధించుకోలేదని, అంతేకాక **'మాఝూ నిజద్రవ్యఠేవ! తవ చరణరజ సేవా'** అంటూ గురుచరణరజమే అసలైన పెన్నిధి అని మనకు మార్గ నిర్దేశకం చేస్తూ – **'శరత్సుధాంశు ప్రతిమ ప్రకాశం కృపాతపత్రం తవసాయినాథ.... త్వదీయ పాదాబ్జ సమాశ్రితానాం స్వచ్ఛాయయా తాపమపాకరోతు'** – "శరత్ చంద్రుని వంటి ప్రకాశము కల్గిన సద్గురుని చరణాలనాశ్రయించిన వారికి ఆత్మానందము కలుగునని" – **'యుష్మత్పాదరజః ప్రభావమతులం ధాతాపి వక్తా క్షమః శ్రీమత్సాయి పరేశ పాద కమలానాన్యచ్చరణ్యం మమ'** – సద్గురు పాదధూళి యొక్క ప్రభావమును సృష్టికర్తకూడా వర్ణించలేడని – గురుచరణాలు, తప్ప శరణులేదని, చివరకు **'రుసోమమ ప్రియయంబికా'** అనే సంకల్ప సం'గీతం'లో **'పదీప్రణయ వోరసో, నిఖిల దృశ్య బాబా దిసో'** – గురుపాదాలపై భక్తి స్థిరంగా ఉండాలని, జగమంతా సద్గురు స్వరూపంగా గోచరించాలని సంకల్పిస్తూ మనకు త్రోవ చూపారు, మనము గురుచరణానురక్తులమవడానికి స్ఫూర్తి ప్రదాతలయ్యారు ఆరతి గీతకారులు. ఒక సూఫీ మహాత్ముడు అంటాడు నీ అందము, ఆనందము, ఆరోగ్యము, ఆస్తిపాస్తి – నీ విభవము, నీ విద్య



ఎంతున్నా, ఏమున్నా, నీ చిత్తము గురుని చరణు, స్మరణమేమో చేయకుంటే బ్రతుకంతా వృథా, వృథా, మిగిలేది వ్యధే కదా!. జన్మలేమో జరుగుతాయి, కర్మలేమో మిగులుతాయి". ఇక అన్నమాచార్యుల వంటి వాగ్గేయకారులు సరేసరి వారి ఎన్నో గీతాల్లో తాము ఆశ్రయించుకున్న చరణాల గురించి "బ్రహ్మ కడిగిన పాదము.... చెలగి వసుధ కొలిచిన నీ పాదము......" అంటూ గురుచరణ ప్రాధాన్యతను చక్కగా వర్ణించారు, అందించారు తర్వాతి తరాలకు. ఒక మూర్తీభవించిన భగవద్వాణి, సద్గురు చరణాలను ఆశ్రయించుకోవడంలోని ఆంతర్యాన్ని ఇలా చెప్పారు "మానవ శరీరానికి ఒక రూపునిచ్చేది, అతి ముఖ్యమైనది తల. మానవాకృతిలో తల అతి ముఖ్యమైన, గౌరవమైన భాగంగా ఉంది. మానవాకృతిని దాల్చిన మహాత్మునిలోని అంత్య భాగమైన చరణాల చెంత మన తలను ఉంచడం ద్వారా వారి పట్ల మనకున్న అత్యున్నత గౌరవభావాన్ని వ్యక్తీకరిస్తున్నాం. అంతే కాక, ఉత్కృష్టమైన తన తలను మహాత్ముని చరణాలనిడి తనను తాను వారికి సమర్పించుకున్నట్లు భావించడం". ఆహా! శాస్త్రవాక్యానికి, సద్గురు వాక్యానికి గల తేడా కదా ఇది! శరణాగతి పథానికి ఇది ఆయువుపట్టు కదా! ఒక్కసారి, ఒకే ఒక్కసారి సద్గురువుకు సమర్పించుకున్న భక్తునికి ఈ జగత్తంతా సద్గురు స్వరూపమే కదా! సద్గురూ! మమ్ములను దీవించు! మీ చరణాలను సేవించి, ఈ జగమంతా ప్రేమమయంగా దర్శించి, సమత, మమతలతో సాయిబిడ్డలుగా జీవించే భాగ్యాన్ని ప్రసాదించు! **గురుర్దేవోభవ – గురువే దేవుడు అగుగాక!**

## పరమాచార్యుని నోట - గురుని మాట

గురువంటే ఏమిటి? గురువనగా ఘనమైనది, పెద్దదీ అని అర్థం. మహిమ కలవాడని భావం. బ్రహ్మ అంటే కూడా గొప్ప, పెద్ద అనే అర్థం. గురువు దేనిలో పెద్ద? మీరందరూ నన్ను పెరియవా, పెరియవర్ అని పిలుస్తారు. నేను దేనిలో పెద్ద? శరీర ప్రమాణంలోనా? నాకు శంకరాచార్యుడనే పేరు ఉండడం వలన మీరందరూ ఆయన గుణగణములూ, మహత్వమూ నాలో ఉన్నదని ఏమరి, నన్ను పెరియవా అని, మహాన్ అని పిలుస్తున్నారు.

మొత్తం మీద గురువంటే అంతర్గతంగా ఒక ఉత్తమ స్థితిని అందుకున్న వాడని తేలుతోంది. బాహిరంగా, ఒకని నడత, విద్వత్తూ అతనిని ఆచార్యుడుగా నిర్దేశిస్తుంది. అతని ఆచార అనుష్ఠానాల వలన, అతని బోధనా చాతుర్యం చేతనూ, అతని శీల సంపద వలననూ మనం ఒకరిని ఆచార్యునిగా ఎన్నగలము. ఇక గురువు మాట ఏమి? అతడు ప్రపంచంలో బహిరంగముగా దేనినీ చేయవలసిన అవసరం లేదు. అతనికి శాస్త్ర పరిజ్ఞానమో, విద్వత్తో ఉండనక్కర లేదు. ఆచార్యుని వలె అతడు సంప్రదాయ, ఆచార అనుష్ఠానాలకు మార్గదర్శిగా వుండనవసరమూ లేదు. ఎంతో మంది మౌన గురువులు, ధ్యాననిష్ఠులు



వుంటారన్న విషయం మనకు తెలిసినదే! తాను తానుగా ఉంటూ ఏకాంతంగా పూర్ణత్వం భజిస్తూ ఎవరైనా వుంటే, అతని ప్రభావం గుర్తించి ప్రజలు అతనిని గురువుగా వరిస్తారు. అంతమాత్రాన అతడు వీరికి శాస్త్ర పాఠములు చెప్పవలెనన్న నియమం లేదు. అతనిని గురువుగా వరించిన వారికి అతని అనుగ్రహశక్తియే పనిచేస్తుంది. వీరిని అతడు శిష్యులుగా భావించి కూడా వుండకపోవచ్చును. కానీ ఆయనను గురువుగా ఏ ఫలాన్ని ఉద్దేశించి ఆశ్రయించారో, ఆ ఫలం వీరికి సులభంగా సిద్ధిస్తున్నది.

ఒకమార్గాన్ని అనుసరించి పోయేవాడు ఆచార్యుడు. ఒక శాస్త్ర సాంప్రదాయాన్ని పాటిస్తూ అతడు శాస్త్ర నిష్ణాతగా ఉండడమే గాక, శాస్త్ర విధులను తాను అనుష్ఠిస్తూ ఇతరులకు బోధ చేస్తూ, వారిచేత వానిని అనుష్ఠింప చేస్తూ విధి విధానంగా, మార్గదర్శకంగా ఉండేవాడే ఆచార్యుడు. గురువట్లు కాదు. అతనికి మానదండం అతని ఆత్మోపలబ్ధియే. అందుచేతనే అతనిని మహాత్ముడని అంటారు. అతని ఆత్మానుభవం కొట్టవచ్చేటట్లు కనపడుతుండటం చేతనే అతనిని ప్రజలు గురువుగా వరిస్తున్నారు. వారికి శీలానుష్ఠానాల అవసరం లేదు. వారికి శాస్త్ర విజ్ఞానం వుండాలన్న నియమం లేదు. వారు జ్ఞానులు. వారెపుడూ బ్రహ్మనిష్ఠలో వుండేవారు. వారు ఎప్పుడూ ఈశ్వర సాన్నిధ్యంలో వుండే ఆనందోన్మత్తులగనో, చిత్తవృత్తుల నిరోధంతో సమాధ్యవస్థలో వుండే యోగులగానో వుంటారు.

ఒక గురువు, స్వయంగా, 'గురుత్వం' ఒప్పుకోకపోయినా 'నేను నీ శిష్యుడను' అని అతనిని ఆశ్రయించిన వాని మధ్యా, అయిష్టుడైన ఆ గురువు మధ్య ఒక సంబంధం ఏర్పడుతుంది, ఈ సంబంధం అతని అనుగ్రహం వల్లనే.

గురువంటే ఘనమైన వాడని చెప్పాం. ఒకనికి అంతరంగిక ఘనత ఉంటుంది. కాని అతనికి బహిప్రపంచమును పైన ఏ విధమైన కోరికా లేకపోవచ్చు. అతనికి అతని ఆత్మానుభూతిలోనే నిష్ఠ. అతడు గురువుగా చేయవలసిన కర్తవ్యం ఏదీ లేదు, గు అంటే అంధకారం, రు అంటే తన్నిరోధకం. గురువు అంటే చీకట్లను పారద్రోలేవారు. అజ్ఞాన నివర్తకుడు. దేవశబ్దానికి ప్రకాశరూపియని అర్థం, "తమసోమా జ్యోతిర్గమయ". మనం అంధకారంలోనుంచి ప్రకాశంలోనికి రావాలి. తమస్ అంటే చీకటి. జ్యోతిస్ అంటే వెలుతురు, జ్ఞానం. అజ్ఞానం అంటే చీకటి. ఆ అజ్ఞానం ప్రకాశం వుంటే కాని పోదు. ఒక విషయాన్ని గురువు బోధిస్తాడు. శిష్యుడు తన బుద్ధి చేత దానిని గ్రహిస్తాడు. అజ్ఞానమనే అంధకారంలోవున్న శిష్యునికి జ్ఞానబోధ చేయగలిగినది ప్రకాశరూపియైన గురువే.

ఒక కర్తవ్యం జరగాలంటే శిష్య గురుసంబంధం ఉండాలి. ఇంట్లో దీపం వెలిగించాలంటే, విద్యుచ్ఛక్తికి దీపానికి మధ్య లంకె ఉండాలి. ఆ లంకె తంతి ద్వారా ఏర్పడుతుంది. జలాశయం నుంచి ఇంట్లో కొళాయి



లోనికి నీళ్లు రావాలంటే పెద్ద జలాశయం నుండి నగరానికి మధ్య పైపులు వేయాలి. అపుడే కొళాయి నుండి నీళ్లు రాగలవు. గురువు వాగ్రూపంగా ఉపదేశం చేస్తుంటే, గురుశిష్యుల మధ్య సంబంధం గురువు వాక్కులే, లేదా **గురువు జీవితంలోని ఆచార వ్యవహారాలే శిష్యుడికి ఉపదేశప్రాయంగా ఉంటాయి.** గురువు మౌనంగా ఉంటూ ఒక సంకల్పం చేస్తే, అదే శిష్యునికి ఉపదేశమవుతుంది. గురువు ఉపన్యాసాల చేతనే ఉపదేశం చేయాలన్న నియమమేదీ లేదు. ఆయన జీవితమే ఒక పెద్ద ఉపదేశం. ఉపదేశ విధానం స్థూలమే కాదు, సూక్ష్మము కూడా. ఒక గురువు వాగ్రూపంగానూ, తన ఆచార అనుష్ఠాన పరిపాలన చేతనూ శిష్యునికి బోధిస్తే అతనిని ఆచార్యుడని అంటారు. ఒకరు ఉపదేశమూ చేయకపోవచ్చు. మార్గదర్శకంగా ఉండకుండానూ పోవచ్చు. కానీ అతని అనుగ్రహమే గురుశిష్యుల మధ్య ఏర్పడిన అవ్యక్త సంబంధమని ఇదివరకే చెప్పాను. **ఆ అనుగ్రహమే అతడిచ్చే ఉపదేశం.**


*బిడ్డతో దోబూచులాడుతున్న తల్లి, తన బిడ్డకు సహకరించే నిమిత్తం, కళ్లకు గంతలతో వెదికే ప్రయత్నంలో దూరంగా వెళ్లిన బిడ్డకు అందుబాటులోకొచ్చే ప్రయత్నం చేస్తుంది. చివరకు తానే దొరికిపోతుంది. బిడ్డ పొందిన విజయహాసాన్ని ఆనందిస్తుంది. భగవంతుడూ అంతే – ఈ మౌనం, ఈ మాయ అంతా తన బిడ్డలతో ఆయన ఆడుకునే ఆట.*


*భగవంతుని ఉనికిని విశ్వసిస్తే ఆయనను ప్రేమించడం నేర్చుకుంటే ఆయనకంటే సులభుడు మరొకరుండరు. అందమైన దొంగాటలో తల్లీ ఆయనే, దొంగా ఆయనే. అయితే కనిపించని వాన్ని, వినిపించని వాన్ని ఎలా ప్రేమించాలి? ఎలా విశ్వసించాలి? అన్న వాటి సమాధానంగానే భగవంతుడు గురురూపంలో మనలా మన మధ్య అవతరించి తన గూర్చి తానే వివరించే పథం – సద్గురు పథం – దొంగాటలో తల్లిలా.*

*– గురుకృప*

**ప్రతి మానవుడూ గురుసాన్నిధ్యంలోనే పరిపూర్ణుడు కాగలడు. తాను ఏమిటో తన ప్రయోజనం ఏమిటో తెలుసుకునే జ్ఞానం గురువు దగ్గరే లభిస్తుంది. మానవుణ్ణి మహాత్మునిగా తీర్చిదిద్దే శక్తి గురువుకు ఉంటుందని వేదాలు, ఉపనిషత్తులు చెబుతున్నాయి. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు కూడా వారి అవతార లక్ష్యాలను గురువు దగ్గరే తెలుసుకోగలిగారు. ఆధునిక పరిభాషలో చెప్పాలంటే మన పాస్‌వర్డ్ గురువు సన్నిధిలోనే తెలుసుకోగలుగుతాం.** – స్వామి రంగనాథానంద

సాయి భక్తులకు సాయినాథుడే
సద్గురువు, దైవం, సాధన, గమ్యం.




"ఏ విశ్వవిద్యాలయాలు కొలువలేని జ్ఞానం ఆయన సొత్తు!
కేవలం ఆయన సాన్నిధ్యం ప్రసాదిస్తుంది సాయి అనే ఆనంద రసానుభూతుల మత్తు!"